సాక్షి
అనకాపల్లి
గురువారం, 3, ఆగస్టు, 2023



## డిజిటల్ రూపంలో ఆర్‌సీ

విశాఖ: ఇక నుంచి డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీలు డిజిటల్ రూపంలో రానున్నాయని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు.




## మిగులు సీట్లకు కౌన్సెలింగ్

విశాఖ: ఐటీఐల్లో మిగుల సీట్ల భర్తీకి 3, 4 తేదీల్లో కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.



## పోస్టర్ విడుదల

విశాఖ స్పోర్ట్స్: పారా బ్యాడ్మింటన్ పోటీల పోస్టర్‌ను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ బుధవారం విడుదల చేశారు.

## న్యూస్‌రీల్

### అక్టోబర్ 2 నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

**లోగో, మస్కట్ తయారీ పోటీలకు గడువు 7వ తేదీ**

అనకాపల్లిటౌన్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2 నుంచి ఐదు విభాగాల్లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య క్రీడా శిక్షకులు ఎల్.వి.రమణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు జరుగుతాయన్నారు. నాన్ కాంపిటేటివ్ విభాగంలో యోగా, 3కే మారథాన్, టెన్నీకాయిట్ క్రీడల్లో 17 ఏళ్ల వయసు పైబడిన వ్యక్తులు పాల్గొనవచ్చన్నారు. ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌కు లోగో, మస్కట్ రూపకల్పనలో విశ్వవిద్యాలయాలు/కళాశాలలు/విద్యావేత్తలు పాల్గొని, వారి ఆలోచనలను పంచుకోవచ్చన్నారు. లోగో, మస్కట్ పోటీల్లో పాల్గొనేవారు తాము రూపొందించిన లోగో, మస్కట్‌లను ఈ నెల 7వ తేదీలోగా https://sports.ap.gov.inల వెబ్‌సైట్ ద్వారా పంపించాలన్నారు. ఎంపిక చేసిన లోగో, మస్కట్ నమూనాల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వాటికి వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు చొప్పున ప్రభుత్వం బహుమతులు ప్రకటించినట్టు తెలిపారు.

### మహిళా వలంటీర్ ఔదార్యం

**పింఛన్ రాని ఇద్దరికి ప్రతి నెల ఆర్థిక సాయం**



తన గౌరవ వేతనం నుంచి సొంతంగా పింఛన్ అందజేస్తున్న ఉమ్మలాడ వలంటీర్ లక్ష్మీ ప్రసన్న

మునగపాక: మండలంలోని ఉమ్మలాడ వలంటీర్ సూరిశెట్టి లక్ష్మీ ప్రసన్న మానవత్వం చాటుకున్నారు. తనకు వచ్చే గౌరవ వేతనం నుంచి ప్రభుత్వం ద్వారా పింఛన్ వచ్చేంతవరకు ఇద్దరికి ప్రతి నెల ఆర్థిక సాయం అందజేసేందుకు ముందుకువచ్చారు. గ్రామానికి చెందిన జి.నాగరత్నం, మజ్జి అమ్మన్నలకు ఆధార్‌లో వయస్సు తేడా ఉండడంతో ప్రభుత్వం నుంచి పింఛన్ అందలేదు. దీంతో ఇద్దరినీ ఆదుకునేందుకు వలంటీర్ లక్ష్మీ ప్రసన్న ముందుకొచ్చారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో వారికి బుధవారం సర్పంచ్ గంగయమ్మ చేతుల మీదుగా వెయ్యి వంతున ఆర్థిక సాయం అందజేశారు. ఆమె ఔదార్యాన్ని పలువురు కొనియాడారు. ఉప సర్పంచ్ మందా రాము, పంచాయతీ కార్యదర్శి నరసింగరావు, వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సూరిశెట్టి రామకృష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### కిడ్నీ బాధిత చిన్నారికి పెన్షన్ మంజూరు



కిడ్నీ వ్యాధిగ్రస్తుడైన బాలుడికి పింఛన్ సొమ్ము అందిస్తున్న సర్పంచ్ దేవీలత

కె.కోటపాడు: కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్న వి.సంతపాలెం గ్రామానికి చెందిన బాలుడు కొమ్మనాపల్లి రాజుకు పెన్షన్ మంజూరైంది. గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిన సమయంలో కిడ్నీ సమస్యతో రాజు పడుతున్న ఇబ్బందులను, కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలుసుకున్నారు. వెంటనే ఈ సమస్యను డీఎంహెచ్‌వోకు వివరించాలని సూచించారు. వైద్య సిబ్బంది రాజు అనారోగ్య సమస్యను నిర్ధారించడంతో ఈ నెల నుంచి పెన్షన్ మంజూరైంది. బుధవారం సర్పంచ్ లెక్కల దేవీలత, పార్టీ గ్రామ అధ్యక్షుడు లెక్కల దేముడునాయుడు, మాజీ సర్పంచ్ వేచలపు సింహాద్రప్పడు (చలం) రాజుకు పెన్షన్ సొమ్మును అందించారు. తమ కుమారుడి కిడ్నీ సమస్యను గుర్తించి పెన్షన్ మంజూరుకు చర్యలను తీసుకున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు రాజు తల్లిదండ్రులు గణేష్, వరలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

### వైద్యుల పోస్టులకు 7న ఇంటర్వ్యూ

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలో పలు సీనియర్ రెసిడెంట్ వైద్యుల పోస్టుల భర్తీకి గాను ఈనెల 7న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. ఆంధ్ర వైద్య కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు అభ్యర్థులు నేరుగా హాజరుకావచ్చన్నారు. వివరాలకు https@//www.amc.edu.in వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 9848314843 నెంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు.

# 'ప్రకృతి' ప్రోత్సాహం

ప్రజల ఆరోగ్యం పట్ల సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం శ్రద్ధ చూపుతోంది. వ్యవసాయాన్ని ప్రకృతి సేద్యం వైపు తీసుకెళ్లేలా ప్రోత్సహిస్తోంది. ప్రకృతి సేద్యానికి వీలుగా దళిత రైతులకు అదనపు సాయం అందిస్తోంది. రూ.10 వేలు విలువైన సామగ్రి, 23 రకాల విత్తనాలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. దీంతో రసాయనాలు, పురుగు మందుల్లేని పంట ఉత్పత్తులకు దోహదపడుతోంది.



దళిత రైతులకు అందించే ప్రకృతి వ్యవసాయ కిట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎస్సీ (రెల్లి) కార్పొరేషన్ చైర్మన్ మధుసూదనరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామారావు (ఫైల్)

- దళిత రైతులకు ప్రకృతి సేద్యంలో అండ
- జిల్లాలో 301 మంది గుర్తింపు
- రూ.10 వేల విలువైన కిట్ల పంపిణీ



ప్రకృతి ప్రోత్సాహ కిట్లు

సాక్షి, అనకాపల్లి: ప్రకృతి వ్యవసాయంలో రాణించేలా దళిత రైతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రూ.10 వేల విలువైన మెటీరియల్, 23 రకాల విత్తనాలను ఉచితంగా అందిస్తోంది. ఇందులో భాగంగా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో 573 మంది ఎస్సీ రైతులను గుర్తించారు. వీరిలో అనకాపల్లి జిల్లాలో 301 మంది, విశాఖ జిల్లాలో 272 మంది ఉన్నారు. వీరికి మొత్తం రూ.57.30 లక్షల విలువైన ప్రకృతి వ్యవసాయ కిట్లను అందిస్తున్నారు. ఇప్పటికే అనకాపల్లి జిల్లాలో సుమారు 100 మందికి కిట్లు అందించారు.

**కిట్‌లో ఉండే సామగ్రి**

ప్రకృతి వ్యవసాయం చేసేందుకు వీలుగా ప్రభుత్వం గుర్తించిన దళిత రైతులకు రూ.10 వేల విలువకు సంబంధించి 8 పారమున్(ట్రోల్స్), 30 స్టిక్కింగ్ ప్లాట్స్, ఒక టార్పాలిన్, 200 లీటర్ల డ్రమ్ము ఒకటి, 100 డ్రమ్ములు రెండు అందించనున్నారు. కిచెన్ గార్డెన్, సీడ్ టు సీడ్, ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్స్(పీఎండీఎస్)కు సంబంధించి 23 రకాల విత్తనాలను అందిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జొన్న, మొక్కజొన్న, జీలుగ, పిల్లిపెసర, జనుము, కొర్ర, రాగులు, సజ్జలు, వేరుశనగ, నువ్వులు, మినుములు, పెసలు, కందులు, ఉలవలు తదితర పంటలతో పాటు కిచెన్ గార్డెన్‌లో భాగంగా పలు రకాల ఆకుకూరలు, కూరగాయలకు సంబంధించిన విత్తనాలను అందిస్తున్నారు.

**ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు**

ప్రకృతి వ్యవసాయంతో అనేక లాభాలు ఉన్నాయి. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులను వాడకుండా, గో ఆధారిత ఎరువులు, వేప సంబంధిత ఉత్పత్తులు, కషాయాలతో నాణ్యమైన పంటలను పండించవచ్చు. పెట్టుబడి ఖర్చు తక్కువగా ఉండటంతో రైతుకు నికరాదాయం పెరుగుతుంది. వాతావరణ కాలుష్యం తగ్గి, రసాయన అవశేషాలు లేని ఆహార పంటల ఉత్పత్తి జరుగుతుంది. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది.

**ప్రభుత్వ ప్రోత్సాహం భేష్**

ప్రకృతి వ్యవసాయంలో ఎస్సీ రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం చాలా బాగుంది. ప్రకృతి సేద్యం ద్వారా వచ్చే ఉత్పత్తులతో ఆరోగ్యంగా ఉండవచ్చు. రసాయనాలతో పండించిన ఆహారం వల్ల క్యాన్సర్‌తోపాటు చాలా రోగాల బారినపడే అవకాశాలున్నాయి. ఎస్సీ రైతులకు ప్రకృతి సాగు పట్ల మా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. రైతులు కూడా ముందుకు వస్తున్నారు. ప్రజలకు ఆరోగ్యకరమైన పంటలతోపాటు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి వస్తుంది. కిచెన్ గార్డెన్ విధానంలో కూరగాయల సాగునూ ప్రోత్సహిస్తున్నాం.

– మధుసూదనరావు, రాష్ట్ర ఎస్సీ(రెల్లి) కార్పొరేషన్ చైర్మన్

**వారంలోగా కిట్ల పంపిణీ పూర్తి**



జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహంలో గుర్తించిన దళిత రైతుల్లో కొందరికి కిట్లు అందించాం. పాయకరావుపేట నియోజకవర్గంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ మధుసూదనరావు, స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు చేతుల మీదుగా 80 మంది రైతులకు పంపిణీ చేశాం. మొదటి విడతలో జిల్లాలో గుర్తించిన 301 మందికి సరిపడా విత్తనాలను స్థానిక ఏపీ ఆగ్రోస్ కార్యాలయంలో ప్యాకింగ్ చేసి, కిట్ల రూపంలో ఉంచాం. వారం రోజుల్లో అందరికీ అందిస్తాం. విశాఖ జిల్లాలోని భీమిలిలో కూడా అందించాం.

–రామారావు, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్, ఉమ్మడి విశాఖ జిల్లా

# ఏజెన్సీలో సీఎం జగన్ పర్యటన రేపు

**కూనవరం మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల సందర్శన**



చింతూరు/కూనవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా): గోదావరి వరద ముంపునకు గురైన కూనవరం మండలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్నారు. ఈమేరకు షెడ్యూల్ ఖరారైంది.

- ఉదయం 10.20కు కూనవరం మండలం కోతులగుట్టలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.20 నుంచి 10.30 వరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలపై హెలిప్యాడ్ వద్ద అధికారులను అడిగి తెలుసుకుంటారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులతో మాట్లాడతారు.
- 10.35కు కోతులగుట్ట నుంచి బయలుదేరి 10.50కు కూనవరం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకుంటారు.
- 10.50 నుంచి మధ్యాహ్నం 12.20 వరకు కూనవరం, వీఆర్ పురం మండలాలకు చెందిన వరద బాధితులతో మాట్లాడతారు.
- 12.20కు కూనవరంలో బయలుదేరి 12.35కు తిరిగి కోతులగుట్టలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుని 12.40కు తాడేపల్లికి తిరుగుపయనమవుతారు.

**హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన**

సీఎం శుక్రవారం పర్యటించనున్న నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం మండలంలోని కోతులగుట్టలో హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. వరద బాధితులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడేందుకు స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో వేదిక ఏర్పాటు చేస్తున్నారు.

# రూ.కోటిన్నరతో నగర వనం

- యలమంచిలి సమీపంలో కొండపై ఏర్పాటుకు ప్రతిపాదనలు
- మంచి టూరిస్టు స్పాట్‌గా అభివృద్ధి చెందే అవకాశం
- ప్రాంతీయ అటవీ సంరక్షణ అధికారి శ్రీకంఠనాథరెడ్డి వెల్లడి



టేకు మొక్కలు, ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి, డీఎఫ్‌వో రాజారావు

యలమంచిలి: రూ.1.50 కోట్లతో యలమంచిలి పట్టణం పెంజెరువు సమీపంలో ఉన్న కొండ ప్రాంతంలో సుమారు 70 ఎకరాల సువిశాల అటవీ ప్రాంతంలో సర్వాంగ సుందరమైన నగర వనం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు విశాఖపట్నం ప్రాంతీయ అటవీ సంరక్షణాధికారి (సీసీఎఫ్) శ్రీకంఠనాథరెడ్డి చెప్పారు. బుధవారం ఇక్కడి అటవీ సంరక్షణ కార్యాలయాన్ని ఆయన డీఎఫ్‌వో బి.రాజారావుతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించి.. కలప, వన్యప్రాణుల వధ కేసుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ మాట్లాడుతూ జిల్లాలో అటవీ సంపద సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అటవీ స్థలాలు అక్రమణకు గురి కాకుండా ఖాళీ స్థలాల్లో మొక్కల పెంపకం, మడ అడవులు, వన సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. అనంతరం యలమంచిలి పట్టణంలో మెట్టపాలెం, అటవీ ప్రాంతంలోని టేకు వనాలను సందర్శించి మొక్కలను పరిశీలించారు. అనంతరం పెంజెరువు వద్ద నగర వనం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా యలమంచిలి అటవీ శాఖ అధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ నగర వనం ప్రతిపాదనల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో చక్కటి వాకింగ్ ట్రాక్, బాలబాలికలు ఆడుకోవడానికి జారుడు బల్లలు, రాశి ఫలాలకు సంబంధించిన వివిధ రకాల మొక్కల పెంపకం, రోప్‌వే ఏర్పాటు వంటివెన్నో ఉన్నాయన్నారు. అప్పుడు ఇది టూరిజం స్పాట్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంటుందన్నారు.

# తల్లీ బిడ్డల చెంతకే పోషకాహారం



గర్భిణి కుమారికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ అందిస్తున్న స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ కె.అనంతలక్ష్మి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్

**వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ**



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్

అనకాపల్లి టౌన్: తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ(టేక్ హోమ్ రేషన్-టీహెచ్‌ఆర్) కిట్లను వారింటికే పంపిస్తున్నట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి తెలిపారు. స్థానిక గుండాల జంక్షన్ జీవీఎంసీ కల్యాణమండపం మేడపైన నియోజకవర్గ సీడీపీవో కె.ప్రభావతి ఆధ్వర్యంలో బుధవారం టీహెచ్‌ఆర్ కిట్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. జిల్లాలోని అర్బన్ పరిధిలో 74, గ్రామీణ ప్రాంతాల్లో 1834 కలిపి మొత్తం 1908 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 9,597 మంది గర్భిణులు, 8,751 మంది బాలింతలు ఉన్నట్లు పేర్కొన్నారు. బాలింతలు, గర్భిణులకు ముఖ ఆధారిత హాజరుతో నెలకు రెండుసార్లు పోషణ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 5లోపు 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర కిలో పామాయిల్, 13 కోడిగుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, రెండు కిలోల చోడిపిండి, కిలో అటుకులు, పావుకిలో చొప్పున బెల్లం, వేరుశనగ చెక్కీలు, ఎండు ఖర్జూరం, రెండో విడత కింద ఈ నెల 16, 17 తేదీల్లో 12 కోడిగుడ్లు, రెండున్నర లీటర్ల పాలు అర్హులైన ప్రతి ఒక్క ఇంటికీ అందిస్తామన్నారు.

జిల్లా పరిషత్ వైస్‌చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి మాట్లాడుతూ నేటి సమాజంలో పుట్టే బిడ్డతోపాటు తల్లి ఆరోగ్యంగా జీవించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తపిస్తున్నారని, అందుకే గర్భిణులు, బాలింతల ఇంటికే పోషణ కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ మహిళాభ్యుదయం, ఆరోగ్యం కోసం సీఎం జగన్ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడానికి ఇబ్బంది పడుతున్నారని, వాటిని దృష్టిలో పెట్టుకున్న సీఎం ఇంటికే పోషణ కిట్లను అందిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి, కశింకోట వైస్ ఎంపీపీలు ఐతా రాము, పెంటకోట జ్యోతి, నియోజకవర్గ ఏసీడీపీవో శశికళ, కశింకోట సచివాలయాల కన్వీనర్, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు విల్లూరి చంద్రశేఖర్, పసుపులేటి రామకృష్ణ, రామ్‌శంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నియామకం

సీతంపేట (విశాఖ): రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లను నియమిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలయ్యింది. చోడవరానికి ది ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ (విశాఖపట్నం), మాడుగులకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్‌ఏ) ఏపీఐఐసీ (విశాఖపట్నం), అరుకులోయకు పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్, పాడేరుకు అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్, అనకాపల్లికి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (అనకాపల్లి), పెందుర్తికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేఆర్‌ఆర్‌సీ (విశాఖపట్నం), యలమంచిలికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌ఏవోటీ (యలమంచిలి), పాయకరావుపేటకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీఎల్‌ఎన్ దేవస్థానం (సింహాచలం), నర్సీపట్నంకు సబ్ కలెక్టర్/రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (నర్సీపట్నం)లను నియమించారు.

అరకులోయకు పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్, పాడేరుకు అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్, రంపచోడవరానికి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (రంపచోడవరం)లను నియమించారు.

# 'జగనన్న సురక్ష' సరికొత్త రికార్డు


- అతి తక్కువ వ్యవధిలో అత్యధిక సేవలు
- రాష్ట్రవ్యాప్తంగా 93.5 లక్షలకు పైగా అభ్యర్థనల పరిష్కారం
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: అతి తక్కువ వ్యవధిలో అత్యధిక సేవలందించిన 'జగనన్న సురక్ష' రాష్ట్ర చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించిందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడి, కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతమైందన్నారు. రైవాడ జలాశయం అతిథి గృహంలో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అర్హులెవ్వరూ సంక్షేమ పథకాలు పొందకుండా మిగిలిపోరాదన్న లక్ష్యంతో ప్రజలకు అసరమైన అన్ని సేవలు అందించేలా ముఖ్యమంత్రి జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టారన్నారు. జూలై 1 నుండి 31 వరకు నెల రోజులు పాటు జరిగిన జగనన్న సురక్షకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15,004 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. 1.69 లక్షల మంది వలంటీర్లు 1.46 కోట్ల కుటుంబాలను నేరుగా కలిసి ఇంటింటా సర్వే చేశారన్నారు. ఈ సర్వేలో నమోదు చేసుకున్న వాటిలో 93.5 లక్షలకు పైబడి ప్రజా అవసరాలను పరిష్కరించగలిగామన్నారు. జూలై 18న ఒక్కరోజే 7.54 లక్షల వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేసి చరిత్ర సృష్టించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 45.33 లక్షల మందికి ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, 41.50 లక్షల మందికి ఆదాయ ధ్రువపత్రాలు, 2.72 లక్షల మందికి ఆధార్ మొబైల్ అప్‌డేషన్, 2.70 లక్షల మందికి వన్ బిలు, 1.40 లక్షల మందికి అడంగల్ ధ్రువపత్రాలు అందజేశామన్నారు. మాడుగుల నియోజకవర్గంలోని 78 సచివాలయాల పరిధిలోని 71,901 లక్షల ఇళ్లల్లో ఇంటింటా సర్వే చేసి జగనన్న సురక్ష కార్యాక్రమం ద్వారా 44,288 మందికి ధ్రువపత్రాలను అందజేసినట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చెప్పారు. నియోజకవర్గంలో 95 శాతం మేర అభ్యర్థనలను పరిష్కరించామని ఆయన వెల్లడించారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డా.వరదపురెడ్డి సింహాచలం నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ తదితర్లు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఓటరు సర్వే



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

తుమ్మపాల: ఓటరు నమోదు ప్రక్రియను ముందస్తు కార్యాచరణ మేరకు ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి, డీఆర్వో పి.వెంకటరమణ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం రాత్రి వివిధ రాజకీయపార్టీల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. బీఎల్వోలు డోర్ నంబర్ ప్రకారమే ఓటర్ల జాబితాను తనిఖీ చేసి మార్పులు, చేర్పులు ఉంటే సవరిస్తారని తెలిపారు. జీరో డోర్ నంబర్, ఒకే ఇంట్లో పది మంది కంటే ఎక్కువ ఓటర్లు, వందేళ్ల వయసు దాటిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించామన్నారు. బీఎల్వోల వెంట వలంటీర్లు వెళ్లకూడదని స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. ఏ ప్రాంతంలోనైనా తప్పులు నమోదైనట్లు గుర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఓటర్ల నమోదులో తప్పొప్పుల పరిశీలనకు తగిన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. 80 శాతం ఓట్లు ఆధార్‌తో అనుసంధానమైనట్లు స్పష్టం చేశారు. సమావేశంలో ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# దుకాణాలపైకి దూసుకెళ్లిన బస్సు

- తెల్లవారుజాము కావడంతో తప్పిన పెను ప్రమాదం
- ఘటన జరిగిన సమయంలో బస్సులో 50మంది ప్రయాణికులు



ధ్వంసమైన మినకుర్తి అప్పారావు షెడ్



నరసింగబిల్లి వద్ద దుకాణాలపైకి దూసుకు వచ్చిన ప్రైవేటు ట్రావెల్ బస్సు




ప్రమాదంలో ధ్వంసమైన నరసింగబిల్లి బోర్డు

కశింకోట: వేకువజామున.. ప్రయాణికులందరూ నిద్రపోతున్న సమయంలో.. ప్రైవేట్ ట్రావెల్ బస్సు రోడ్డు పక్కన దుకాణాలపైకి దూసుకురావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. అయితే ఆ సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని నరసింగబిల్లి వద్ద ఈ ఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న బస్సు బుధవారం ఉదయం 4 గంటల సమయంలో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కాలువను దాటుకొని దుకాణాలపైకి వచ్చింది. చెట్టును ఢీకొని ముందు టైరు పేలిపోయి ఆగింది. అదృష్టవశాత్తూ బస్సులో ప్రయాణికులకు ఎటువంటి హాని జరగలేదు. అలాగే ప్రమాద సమయంలో రోడ్డు పక్కనున్న దుకాణాల వద్ద ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది. ఈ ఘటన వేకువజామున జరగడం వల్ల ఎవరూ లేరని, లేదంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. బస్సు రోడ్డు పక్కనున్న ఏదైనా విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఉంటే పెను ప్రమాదం జరిగేదని ప్రయాణికులు పేర్కొన్నారు. ప్రమాద సమయంలో బస్సులో 50 మంది వరకు ప్రయాణికులున్నట్లు సమాచారం. బస్సు డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడం వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు. ప్రమాదం అనంతరం ప్రయాణికులను వేరే బస్సుల్లో గమ్యాలకు తరలించారు.

**మూడు దుకాణాలు ధ్వంసం**

ప్రమాదంలో మూడు దుకాణాలు దెబ్బతిన్నాయి. రోడ్డు పక్క కమ్మరి కులవృత్తి చేసుకునే మిన్నకుర్తి అప్పారావుకు చెందిన షెడ్‌లోకి బస్సు దూసుకు వచ్చి షెడ్ ధ్వంసమైంది. కమ్మరి పనికి ఉపయోగించే మోటారు, మోటారు సైకిల్ దెబ్బతిన్నాయని అప్పారావు వాపోయారు. షెడ్‌ను ఆనుకొని ఉన్న తమ ఇంట్లో భార్య సత్యవతి, మనుమరాలు షర్మిలతో ఉండగా పెద్ద శబ్దం వచ్చిందని, బయటకు వచ్చి చూడగా బస్సు తమ షెడ్‌ను ధ్వంసం చేసిందన్నారు.

ఇదే పగటి పూట జరిగి ఉంటే తామంతా ప్రమాదానికి గురయ్యేవారమని, పగటి పూట అదే షెడ్‌లో కమ్మరి పని చేసుకుంటామని ఆందోళన వ్యక్తం చేశారు. పండూరి ఈశ్వరరావుకు చెందిన చిన్న టిఫిన్ హోటల్ ముందు భాగం ప్రమాదంలో దెబ్బతింది. పక్కనున్న మరో కమ్మరి పాక కూడా ధ్వంసమైంది. ఇక బస్సు దూసుకురావడం వల్ల జాతీయ రహదారి పక్కనున్న మురికి కాలువ కొంత భాగం దెబ్బతింది. పక్కనున్న బోర్డులు, స్తంభాలు కూడా ధ్వంసమయ్యాయి. ప్రమాద స్థలాన్ని ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి సందర్శించి దర్యాప్తు చేపట్టారు.

## క్లుప్తంగా

### సెప్టెంబర్ నాటికి పార్టీ భవన నిర్మాణం



వైఎస్సార్‌సీపీ నూతన కార్యాలయ భవన నిర్మాణాన్ని పరిశీలించిన బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లి టౌన్: జీవీఎంసీ విలీన గ్రామమైన కొత్తూరులో వైఎస్సార్‌సీపీ నూతన జిల్లా పార్టీ నిర్మాణ భవనాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈఏడాది సెప్టెంబర్ నాటికి పూర్తిస్థాయిలో భవన నిర్మాణం జరుగుతుందని, ప్రస్తుతం మొదటి స్లాబ్ పూర్తి అయిందని రెండో శ్లాబ్ పనులు ప్రారంభించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

### ట్రయల్ కేసులపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ(విశాఖ తూర్పు): విశాలాక్షినగర్‌లో కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కార్యాలయం సమావేశ మందిరంలో ముఖ్యమైన ట్రయల్ కేసులపై బుధవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌లో 2, 4, 7,10, 12వ ఏడీజే కోర్టుల పీపీలు, పోలీసు అధికారులు పాల్గొని ట్రయల్ కేసులపై చర్చించారు. ఎస్పీ మాట్లాడుతూ తీవ్రమైన నేరాలలో వివిధ కోర్టులలో సమర్పించిన అభియోగాల పత్రాలను కోర్టు విచారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలుకువలు గురించి వివరించారు. వాటి విషయంలో కేసులు దర్యాప్తు చేస్తున్న అధికారులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మార్గనిర్దేశం చేయాలని కోరారు.

### ప్రమాదాల నివారణకు ఆర్టీసీ చర్యలు

దాబాగార్డెన్స్: ప్రమాదాల నివారణకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ రవికుమార్ బుధవారం జోన్–1 డిపో మేనేజర్లతో భేటీ అయ్యారు. రూట్‌మ్యాప్‌లు పరిశీలించడంతోపాటు ఆర్‌అండ్‌బీ, రీజనల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ, లోకల్ మున్సిపాలిటీలు రూపొందించిన ప్రమాద నివారణ చర్యలపై సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# హెల్త్ వెల్‌నెస్ భవనాల నిర్మాణాలు వేగవంతం

- 10 పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి హేమంత్
- ఆర్.వై.అగ్రహారంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవల తనిఖీ



ఆర్.వై.అగ్రహారంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో



నిర్మాణంలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ భవనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

కె.కోటపాడు: ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి అనకాపల్లి జిల్లాలో నిర్మాణంలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ భవనాలను పూర్తి చేసేలా చర్యలను తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను కోరినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎ.హేమంత్ తెలిపారు. మండలంలో ఆర్.వై.అగ్రహారం గ్రామంలో బుధవారం నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉద్దేశించిన విధంగా రోగులకు 14 రకాలైన రక్త పరీక్షలను, 105 రకాలైన మందులను ఇస్తున్నారో లేదో ఆరా తీశారు. రోగులతో ఆయన మాట్లాడుతూ వైద్య సేవలను నిర్వహించే రోజు వైద్యాధికారితో పాటు వైద్య సిబ్బంది గ్రామంలోనే ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఉంటారని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో 303 హెల్త్ వెల్‌నెస్ భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వగా ఇప్పటికే 25 భవనాలు పూర్తయ్యాయని తెలిపారు. ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల 3 లక్షల మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. రక్తహీనత సమస్య బారిన పడకుండా ఉండేందుకు చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఆర్.వై. అగ్రహారంలో నిర్మాణంలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ భవనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శైలజ, హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, హెచ్‌వి భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎం రాము, హెల్త్ అసిస్టెంట్ ఆర్.గంగాధర్ పాల్గొన్నారు.

# పీఏసీఎస్ కమిటీల పదవీకాలం పొడిగింపు

- ఆరుమాసాలు పొడిగించిన ప్రభుత్వం
- వేంపాడు, గొడిచర్ల సంఘాలకు నూతన ఛైర్మన్‌ల నియామకం



గొడిచర్ల పీఏసీఎస్ అధ్యక్షుడిగా నియామక ఉత్తర్వులు తీసుకుంటున్న పాపారావు



వేంపాడు పీఏసీఎస్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మణిరాజు

నక్కపల్లి: జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల త్రిసభ్య కమిటీల పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఆరు మాసాలు పొడిగించింది. జిల్లాలో 97 పీఏసీఎస్‌లు ఉన్నాయి. తాజా ఉత్తర్వుల ప్రకారం పర్సన్ ఇన్‌చార్జ్‌లు(ఛైర్మన్)లు, డైరెక్టర్లు వచ్చే జనవరి 30వ తేదీ వరకు పదవిలో కొనసాగుతారు. అయితే కొన్ని సంఘాల్లో మార్పులు చేర్పులు జరిగాయి. గతంలో ఎన్నికల్లో గెలుపొందిన వారినే ఛైర్మన్‌లుగా కొనసాగించడంతో పాటు, డైరెక్టర్లలో ఇద్దరిని సభ్యులుగా నామినేట్ చేశారు. ఏడాది క్రితం కొన్ని సంఘాల్లో మార్పులు జరిగి కొత్త వారికి అవకాశం కల్పించారు. తిరిగి ఈ దఫా పాతవారిలో కొంతమందిని తిరిగి యథావిధిగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మార్పులు చేర్పుల ప్రక్రియలో భాగంగా పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సిఫార్సు మేరకు నక్కపల్లి మండలం వేంపాడు సొసైటీ ఛైర్మన్‌గా అయినంపూడి బంగార్రాజు(మణిరాజు), గొడిచర్ల పీఏసీఎస్ ఛైర్మన్‌గా పొడగట్ల పాపారావులను నియమించింది. వీరితోపాటు డైరెక్టర్లుగా అల్లు రమణ, కాకర స్వరూపరాణి (గొడిచర్ల), దొంగల ముసిలి, నక్కా చిట్టమ్మ( వేంపాడు)లను నియమించింది. నక్కపల్లి సొసైటీ ఛైర్మన్‌గా గతంలో నియమించిన యలమంచిలి తాతబాబును మరో ఆరుమాసాలు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నామవరం సొసైటీ ఛైర్మన్‌గా కె.సుందరలత, డైరెక్టర్లుగా పక్కుర్తి మాధవ స్వామి, అడపా నాగ సత్యనారాయణ, అలాగే శ్రీరాంపురం పీఏసీఎస్ ఛైర్మన్‌గా చిక్కాల సత్య సుబ్బలక్ష్మి, డైరెక్టర్లుగా నీలాపు బాలకృష్ణారెడ్డి, బగ్గు విస్సన్న, పాయకరావుపేట పీఏసీఎస్ ఛైర్మన్‌గా దేవవరపు రాజేష్‌ఖన్నా, డైరెక్టర్లుగా దేవవరపు శ్రీనివాసరావు, అల్లు చంటిబాబులను నియమించారు. వీరంతా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

# పట్టపగలే చోరీ

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణ

యలమంచిలి: పట్టణంలోని కొత్త ఎర్రవరంలో బుధవారం పట్టపగలే చోరీ జరిగింది. మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో గ్రామంలో కొడుకు ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలు జాజుల ఆదెమ్మ(77) మెడలో రెండున్నర తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి తెంపి అపహరించుకుపోయాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు బుధవారం రాత్రి విలేకర్లకు తెలిపారు. పట్టణంలో ఇటీవల వరుసగా చోరీలు జరుగుతున్నందున గస్తీ ముమ్మరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# శభాష్ వలంటీర్..



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వికలాంగునికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివ

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకం పెరుగుతుంది. వారికి అప్పగించిన పనిని సకాలంలో చేయడంతో పాటు పలువురు వలంటీర్లు మానవత్వాన్ని చాటుకుంటున్నారు. మునగపాకకు చెందిన గోగుల నెహ్రూ కేజీహెచ్‌లో ప్రేగుకు సంబంధించి శస్త్ర చికిత్స చేసుకున్నాడు. అక్కడే వైద్యం పొందుతున్న నెహ్రూకు ఆగస్టు నెలకు సంబందించిన వికలాంగ పింఛన్ రూ.3000ను స్థానిక వలంటీర్ కొర్ని శివ బుధవారం అందజేశారు. దీంతో స్థానికులు వలంటీర్ శివ సేవలను పలువురు అభినందిస్తున్నారు.

# సినీ గాయకుడు ధనుంజయ్‌కి డాక్టరేట్



వీసీ ప్రసాద రెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ధనుంజయ్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాల యం సంగీత విభాగం పరిశోధక విద్యార్థి, సినీ గాయకుడు సీపాన ధనుంజయ్‌కి ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు సరస్వతి విద్యార్థి పర్యవేక్షణలో '1960–2020 మధ్య కాలంలో సినీ సంగీతంలో వీణ, వయోలిన్, వేణువుల వినియోగం–అధ్యయనం' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ధనుంయ్ స్వీకరించారు.

# మెయిన్ రోడ్డు విస్తరణ 90 అడుగులకు కుదింపు

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



భవన యజమానులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణను వంద అడుగుల నుంచి 90 అడుగులకు కుదిస్తున్నట్టు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. బుధవారం మెయిన్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న భవన యజమానులను కలిసి, రోడ్డు విస్తరణకు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. కొంత మంది భవన యజమానులు ఎమ్మెల్యేకు నిరభ్యంతర పత్రాలను అందజేసి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వంద అడుగులకు విస్తరించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని, అయితే భవన యజమానుల అభ్యర్థన మేరకు 90 అడుగులకు రోడ్డు విస్తరణ కుదించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. భవన యజమానులు రోడ్డు విస్తరణకు సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఆయన వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌ఛైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, టీపీఎస్ ప్రసాదరావు, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది ఆయన వెంట పాల్గొన్నారు.

# పెద్దేరు నీరు విడుదల



జలాశయం నుంచి సాగునీరు విడుదల చేస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్, జలాశయం అధికారులు



కాలువల ద్వారా ప్రవహిస్తున్న నీరు

మాడుగుల: మండలంలో పెద్దేరు జలాశయం నుంచి ప్రధాన పంట కాలువలకు బుధవారం వైస్‌ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, జలాశయం డీఈఈ చిన్నంనాయుడు సాగు నీరు విడుదల చేశారు. ఆర్‌ఎంసీ (కుడికాలువ)కి 40 క్యూసెక్కులు, రాచకట్టు (ఎడమకాలువ)కు 40 క్యూసెక్కులు నీరు విడుదల చేశారు. జలాశయం ఆయకట్టు ప్రాంతాలైన రావికమతం, బుచ్చెయ్యపేట,మాడుగుల మండలాల్లోని 15,105 ఎకరాలకు సరిపడా సాగునీరు ఉన్నట్టు జలాశయం జేఈ సుధాకర రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో జాలంపల్లి, జేడీపేట, సర్పంచ్‌లు ధారమల్లేశ్వరిచిన్ని, కొసిరెడ్డి కృష్ణమూర్తి, ఉపసర్పంచ్ బోర లక్ష్మి చిన్న, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి బొద్దపు భాస్కరరావు, ఏఈఈ జి.పైడితల్లి నాయుడు, మాడుగుల ఏఈఈ డి.భార్గవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో జారిపడి విద్యార్థినికి గాయాలు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని మేఘన

ఎస్.రాయవరం: లింగరాజుపాలెం మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే పాఠశాలలో ఆరబెట్టిన వస్త్రాలు తీస్తుండగా విద్యార్థిని జారిపడి తీవ్ర గాయాలైనట్టు ఎస్‌ఐ ప్రసాద్‌రావు బుధవారం తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న డి.మేఘన గడిచిన రాత్రి పాఠశాల గదిలో జారిపడడంతో కాలు విరిగి, గెడ్డానికి గాయమైనట్టు చెప్పారు. కె కోటపాడు మండలం వారాడ గ్రామానికి చెందిన మేఘన రెండేళ్ల క్రితం లింగరాజుపాలెం పాఠశాలలో చేరి చదువుకుంటోంది. పాఠశాలలో తమ కుమార్తె జారిపడిన వార్త తెలియగానే తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటికే పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు మేఘనను ముందుగా నక్కపల్లి, ఆ తరువాత ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విరిగిన కాలికి శస్త్ర చికిత్స అవసరం కావడంతో విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ ప్రసాద్‌రావు సంఘటన స్థలాన్ని పరిశీలించి విద్యార్థి తల్లి దేవుడమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

# రుచికరంగా అంగన్‌వాడీ భోజనాలు

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు



మాడుగుల బాలుర హైస్కూల్లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

మాడుగుల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు నెలకు రెండుసార్లు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు తెలిపారు. ఇందులో భాగంగా మాడుగులలోని 3, 4, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న భోజనాన్ని బుధవారం రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక బాలికల, బాలుర హైస్కూళ్లలో కూడా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. బాలుర హైస్కూల్లో వండిన వెజిటబుల్ పులావ్‌లో కాయగూరలు తక్కువగా ఉండి, సరిగా ఉడకకపోవడంతో, ఇకపై జాగ్రత్త వహించాలని నిర్వాహకులకు సూచించారు. సాయంత్రం స్థానిక బాలుర కళాశాల వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థుల రాత్రి భోజన సన్నాహాలను పరిశీలించారు. వసతి గృహం పరిశుభ్రంగా ఉండటంతోపాటు, భోజనాలు మెనూ ప్రకారం, రుచిగా ఉన్నాయన్నారు. ఆయన వెంట సీహెచ్ డీటీ ఈశ్వరరావు, ఏఎస్‌వో సీఆర్ కల్యాణి, మండల రేషన్ డీలర్ల సంఘ సభ్యుడు చింతా మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# 'రైవాడ'లో భారీ చేపలు

లొట్టలేస్తున్న భోజన ప్రియులు



మత్స్యకారుల నుంచి కొనుగోలు చేసిన భారీ చేప



వలకు చిక్కిన 20 కేజీల భారీ చేప

దేవరాపల్లి: రైవాడ జలాశయంలో మత్స్యకారుల వలకు భారీ చేపలు చిక్కుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరద నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో విరివిగా చేపలు దొరుకుతున్నాయి. జలాశయంలో నాటు పడవపై వల వేసి వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్న స్థానిక మత్స్యకారులకు 10 కేజీల నుంచి 25 కేజీల బరువు వరకు ప్రస్తుతం చేపలు లభిస్తున్నాయి. గత మూడు నెలలు పెద్దగా చేపలు చిక్కలేదు. తాజాగా పెద్ద చేపలు లభిస్తుండడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైవాడ జలాశయంలో లభించే చేపలు మంచి రుచిగా ఉంటాయని సుదూర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఉమ్మడి విశాఖతోపాటు విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి వస్తుంటారు. పెద్ద చేపలు పడడంతో నలుగురైదుగురు కలిసి కొనుగోలు చేస్తున్నారు.

### యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: కైలాసపురం కస్తూరినగర్‌కు చెందిన బి.సాయిచంద్ బుధవారం తన స్నేహితులతో రుషికొండ బీచ్‌కు వచ్చి స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగాడు. అయితే అలల తాకిడికి కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డ్స్ నూకరాజు, సతీష్, అమ్మోరు, చిన్నప్పన్న వెంటనే రంగంలోకి దిగి యువకుడిని సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు.

# వృద్ధుడి నేత్రదానంతో ఇద్దరికి చూపు

తండ్రి కళ్లను దానం చేసిన కుమారులు



కృష్ణ కుమారులకు సర్టిఫికెట్ అందజేస్తున్న మోహిసిన్ ఐ బ్యాంక్ వైద్యులు

ఆరిలోవ: వృద్ధాప్యంతో మృతి చెందిన ఓ వ్యక్తి కళ్లను ఆయన కుమారులు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. వివరాలివీ.. జీవీఎంసీ 11వ వార్డు పరిధి పార్వతీనగర్‌కు చెందిన లంకపల్లి కృష్ణ(75) బుధవారం మరణించారు. అవయదానంపై అవగాహన ఉన్న మృతుడి కుమారులు ఎల్.రమణ, ఎల్.సురేష్ తండ్రి కళ్లను దానం చేసేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రిలోని మోహిసిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులను సంప్రదించారు. దీంతో ఎల్వీపీ కంటి వైద్యులు, ఐ బ్యాంక్ ప్రతినిధులు పార్వతీనగర్ చేరుకున్నారు. మృతుడి రెండు కళ్ల నుంచి కార్నియాలు తొలగించి ఐ బ్యాంక్‌లో భద్రపరిచారు. నేత్రదానం చేసిన కృష్ణ కుటుంబ సభ్యులను అభినందించి ధ్రువీకరణపత్రం అందించారు. నేత్రదానంపై అపోహలు వీడాలని పిలుపునిచ్చారు.

# రాత్రి వేళ విమానాలు బంద్!

- నవంబరు 15 నుంచి మార్చి ఆఖరు వరకు..
- ఎయిర్‌పోర్టు రన్‌వేపై రీ–సర్ఫేసింగ్ పనులు
- పదేళ్లకోసారి వీటిని చేపట్టనున్న నేవీ అధికారులు
- రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల దాకా విమాన సర్వీసులు రద్దు
- మూసివేత సమయాన్ని తగ్గించాలని విమానాశ్రయ అధికారుల వినతి



ఎయిర్‌పోర్టులో విమానం నైట్ ల్యాండింగ్ (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఐదున్నర నెలలపాటు రాత్రి వేళ విమాన సర్వీసులు నిలిచిపోనున్నాయి. ఆ సమయంలో పదకొండు గంటల పాటు విమానాల రాకపోకలు రద్దు కానున్నాయి. విశాఖ ఎయిర్‌పోర్టు నావికాదళం ఆధీనంలో ఉంది. నేవీ యుద్ధ విమానాలు, ఎయిర్ క్రాఫ్ట్‌లు ఐఎన్ఎస్ డేగా రన్‌వే నుంచే కార్యకలాపాలు సాగిస్తాయి. పౌర విమానాలు కూడా ఐఎన్ఎస్ డేగా నియంత్రణలో ఉన్న ఈ రన్‌వే మీదుగానే ల్యాండింగ్, టేకాఫ్‌లు జరుగుతాయి. నావికాదళం ప్రతి పదేళ్లకోసారి తమ రన్‌వేలకు రీ–సర్ఫేసింగ్ పనులను చేపడుతుంది. ఈ ప్రక్రియలో రన్‌వేపై మూడు పొరలను తొలగించి మళ్లీ కొత్తగా వేస్తారు. ఇంకా అవసరమైన ఇతర పనులు చేపడతారు. ఐఎన్ఎస్ డేగాలో 2009లో రీ–సర్ఫేసింగ్ నిర్వహించారు. పదేళ్ల తర్వాత అంటే.. 2019లో మరోసారి నిర్వహించాల్సి ఉన్నా ఇప్పటివరకు జరగలేదు. ఈ ఏడాది ఈ రీ–సర్ఫేసింగ్‌ను నవంబర్ 15 నుంచి మార్చి నెలాఖరు వరకు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ పనులను రాత్రి 9 గంటల నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకు చేపడతారు. అందువల్ల ఆ సమయంలో ఈ రన్‌వేను మూసివేస్తారు. దీంతో ఈ 11 గంటల్లో విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలను నిలిపివేస్తారు. ఫలితంగా దాదాపు 12 విమాన సర్వీసులకు అంతరాయం కలగనుంది. వీటిలో సింగపూర్ వెళ్లే ఏకైక అంతర్జాతీయ సర్వీసుతో పాటు ఢిల్లీ, హైదరాబాద్, పూణే, బెంగళూరు, కోల్‌కతా విమానాలు న్నాయి. ఈ విమానాశ్రయం నుంచి ప్రస్తుతం రోజుకు 30 టేకాఫ్‌లు, 30 ల్యాండింగులు జరుగుతున్నాయి.

**పర్యాటక సీజను వేళ**

ఏటా అక్టోబర్ నుంచి పర్యాటక సీజను ప్రారంభమవుతుంది. ఈ సీజనులో వివిధ ప్రాంతాల నుంచి విశాఖకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఇలా ఐదారు నెలల పాటు విమానాలకు పర్యాటకుల రద్దీ కొనసాగుతుంది. సాధారణంగా వింటర్ సీజనులో పర్యాటకుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని విమానయాన సంస్థలు తమ షెడ్యూళ్లను పెంచుతుంటాయి. కానీ ఈ ఏడాది వింటర్ పీక్ సీజనులో రీ–సర్ఫేసింగ్ మొదలవుతుండడంతో రాత్రి పూట విమాన సర్వీసులు రద్దు కానున్నాయి. అదనపు షెడ్యూళ్లు పెంచడానికి బదులు తగ్గే అవకాశాలున్నాయి. నేవీ రీ–సర్ఫేసింగ్ దృష్ట్యా తమ సర్వీసుల షెడ్యూల్ వేళల్లో తగిన మార్పులు చేసుకోవాలని ఇప్పటికే సంబంధిత విమానయాన సంస్థలకు సూచిస్తున్నారు.

**మూసివేత సమయం తగ్గించాలని కోరాం..**



రీ–సర్ఫేసింగ్‌లో భాగంగా ఐఎన్ఎస్ డేగా రన్‌వేను నవంబరు 15 నుంచి మార్చి ఆఖరు వరకు రాత్రి వేళ 11 గంటల సేపు మూసివేయనున్నట్టు నేవీ నుంచి సమాచారం అందింది. దీనివల్ల రాత్రి 9 నుంచి మర్నాడు ఉదయం 8 గంటల మధ్య విమానాల రాకపోకలు సాగించే వీలుండదు. ఆ సమయంలో 12 ముఖ్య విమాన సర్వీసులు రద్దవుతాయి. అందువల్ల రాత్రి 10.30 నుంచి మర్నాడు 6.30 గంటల వరకు (8 గంటలు) రన్‌వే మూసివేత సడలించాలని నేవీ ఉన్నతాధికారులను కోరాం. దానిపై ఇంకా ఏ సమాచారం లేదు. నేవీ రీ–సర్ఫేసింగ్ విషయాన్ని మా ఎయిర్‌పోర్టు అథారిటీ ప్రధాన కార్యాలయానికి నివేదించాం. అలాగే రీ–సర్ఫేసింగ్ నేపథ్యంలో షెడ్యూళ్లను సర్దుబాటు చేసుకోవాలని విమానయాన సంస్థలకు సూచించాం. –ఎస్.రాజారెడ్డి, డైరెక్టర్, విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం

## క్లుప్తంగా

### ఓటరు జాబితా లోపాలపై జాగ్రత్త



బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

**అనకాపల్లిటౌన్:** ఓటరు జాబితా పరిశీలనలో లోపాలుంటే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ సూచించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం రాత్రి బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 251 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, పది మంది బీఎల్‌వోలకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 21లోపు పూర్తిస్థాయిలో ఇంటింటి ఓటర్ పరిశీలన పక్కాగా నిర్వహించాలన్నారు.

### ఫీ'జులుం' అరికట్టాలి



కోన లక్ష్మణ

**అనకాపల్లిటౌన్:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల్ని వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. స్థానిక నెహ్రూచౌక్‌లోని తమ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, నిబంధనల ఉల్లంఘన, అర్హతల్లేని సిబ్బందితో బోధన, అనుమతుల్లేకుండా వసతి గృహాలు, కోచింగ్ సెంటర్ల నిర్వహణ తదితర అంశాల్లో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఉచిత విద్య, ఆన్‌లైన్ ప్రవేశాలకు సంబంధించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. వీటిపై రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్యకు లేఖలు పంపినట్లు వెల్లడించారు.

### తాగునీరు వృథా



వృథాగా పోతున్న తాగునీరు

**పరవాడ:** ముత్యాలమ్మపాలెం తీరం వద్ద ఏర్పాటు చేసిన కుళాయి నుంచి కొంత కాలంగా తాగునీరు వృథాగా పోతోంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు, స్థానిక మత్స్యకార్మికుల దాహార్తి తీర్చడానికి తీరం వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయి మరమ్మతులకు గురైంది. కుళాయి మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### అనకాపల్లి సినిమాలు

| | | |
|---|---|---|
| బేబి | : | రాజా |
| బ్రో | : | సత్యనారాయణ స్క్రీన్-1 |
| మహావీరుడు | : | సత్యనారాయణ స్క్రీన్-2 |
| బ్రో | : | షిర్డిసాయి |
| మిషన్ ఇంపాజిబుల్(తెలుగు) | : | పర్తిసాయి |
| బ్రో | : | వెంకటేశ్వర |
| అన్నపూర్ణ ఫొటో స్టూడియో | : | శ్రీసత్య |
| బ్రో | : | రామచంద్ర |

### బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 48 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | 4,000 | 4,160 |
| రెండో రకం | 3,950 | 3,950 |
| మూడోరకం | 3,880 | 3,900 |

### రక్త నిల్వలు

**అనకాపల్లిటౌన్:** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 25 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-3 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లిటౌన్:** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 316 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.



# పటిష్టంగా పల్లెదారి

- రూ.32 కోట్లతో కొత్తూరు-బంగారుమెట్టకు రోడ్డు
- శరవేగంగా జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు
- మంత్రి అమర్‌నాథ్ చొరవతో ఏళ్లనాటి కల సాకారం

**కొత్తూరు-బంగారుమెట్ట రోడ్డు.. 25 గ్రామాల ప్రజల రాకపోకలకు ప్రధాన రహదారి. భారీ గోతులతో ఉన్న ఈ రోడ్డుకు గత ప్రభుత్వాలు ప్యాచ్ వర్క్‌లు చేశాయి తప్ప, పునరుద్ధరించలేదు. ప్రతి ఎన్నికల ముందు స్థానిక ప్రజల డిమాండ్ ఇదొక్కటే. గత ఎన్నికల ముందు ప్రస్తుత మంత్రి అమర్‌నాథ్ ఇచ్చిన హామీని ఆచరణలో పెట్టారు.**



శరవేగంగా పనులు జరుగుతున్న కొత్తూరు-బంగారుమెట్ట రోడ్డు



బీఆర్టీ కాలనీ వద్ద పూర్తిచేసిన డబుల్ లేయర్ సీసీ రోడ్డు

**తుమ్మపాల:** దశాబ్దాల తరబడి కలగా మిగిలిన కొత్తూరు-బంగారుమెట్ట రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. నిత్యం క్వారీ మెటీరియల్ తరలించే భారీ వాహనాల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని పటిష్టంగా రోడ్డును నిర్మిస్తున్నారు. మండలంలో కొత్తూరు నుంచి బంగారుమెట్ట వరకు 23 కిలోమీటర్ల పొడవున దాదాపు 25 గ్రామాల మీదుగా అనకాపల్లి, బుచ్చెయ్యపేట మండలాలను ఈ రోడ్డు అనుసంధానిస్తుంది. మొన్నటి వరకు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే భారీ గోతులతో నరకయాతనగా ఉండేది. తరచూ ప్రమాదాలే. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో రూ.32 కోట్ల వ్యయంతో ఈ రోడ్డు పునరుద్ధరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

**టీడీపీ హయాంలో మరమ్మతులతో సరి**

గత టీడీపీ ప్రభుత్వం మరమ్మతుల రూపంలో పలుమార్లు టెండర్లు పిలిచి, సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. నామమాత్రపు రోడ్డు పనులతో ప్రతి సారీ రూ.లక్షల్లో దోచుకున్నారని స్థానికుల ఆక్షేపణ. నాణ్యతను పట్టించుకోకుండా చేపట్టిన పనులు, పూర్తయిన కొన్ని రోజుల్లోనే గోతులమయంగా మారేవి. వర్షాలు కురిశాయంటే.. ప్యాచ్ వర్క్‌లు కొట్టుకుపోయి, పాత రోడ్డే కనిపించేదని గ్రామస్తులు చెప్తున్నారు. దీంతో విసిగిపోయిన ఆయా గ్రామాల ప్రజలు ఎన్నికల సమయంలో రోడ్డు అభివృద్ధిపై గట్టిగానే పట్టుబట్టారు. ఈ మేరకు ఎన్నికల ముందు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హామీతో, ఎట్టకేలకు ఈ రోడ్డుకు మోక్షం దక్కింది. ఈ రోడ్డు పది కాలాల పాటు నిలిచేలా రూ.32 కోట్లతో కాస్త గట్టిగానే నిర్మిస్తున్నారు.

**డబుల్ లేయర్ రోడ్డు**

ఈ రోడ్డు నిర్మాణంలో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. 23 కిలోమీటర్ల పొడవు గల రహదారికి ఆనుకుని అనేక గ్రామాలు ఉన్నాయి. కొన్ని ప్రధాన గ్రామాల కూడళ్లను మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డబుల్ లేయర్ మధ్యలో ఇనుప మెస్ ఏర్పాటుచేసి అత్యాధునిక టెక్నాలజీతో శాశ్వతంగా నిలిచిపోయేలా రోడ్డును ఏర్పాటుచేస్తున్నారు. గ్రామాల చివరి వరకు సీసీ రోడ్డు చేపట్టి, అక్కడి నుంచి రెండు లేయర్లతో తారు రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. రెండు లైన్లుగా వేస్తున్న ఈ రోడ్డు నాణ్యతకు ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**శరవేగంగా రోడ్డు నిర్మాణం**

అనకాపల్లి మండలం కొత్తూరు నుంచి ప్రారంభించిన ఈ రోడ్డు పనులు ఇప్పటికే సగానికి పైగా పూర్తి చేశారు. మిగిలిన పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ముందుగా ఆయా గ్రామాల ప్రధాన కూడళ్లల్లో సీసీ రోడ్లను పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. మిగిలిన పనులు అతి త్వరలో పూర్తి చేసి, నిరాటంకంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

**నాణ్యంగా రోడ్డు పనులు**

ఏఎంఏఎల్ కళాశాల నుంచి రోడ్డు పనులు చాలా నాణ్యంగా చేస్తున్నారు. పనుల్లో ఎలాంటి రాజీ పడట్లేదని చూస్తేనే తెలిసిపోతుంది. ఈ రోడ్డు చాలా ఏళ్లు నిలిచిపోతుందన్న నమ్మకం ఉంది. ఇక నుంచి మా గ్రామాలకు రాకపోకల్ని ఈజీ అవుతాయి. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ నేరవేర్చారు.

–పల్లెల శివకిరణ్, కుంచంగి

**అతి త్వరలో పనులు పూర్తి**

కొత్తూరు-బంగారుమెట్ట రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికి వరకు దాదాపు 50 శాతం పనులు పూర్తి అయ్యాయి. నిత్యం క్వారీ లారీలు రాకపోకలు సాగిస్తున్న రోడ్డు కావడంతో రోడ్డు నిర్మాణం అత్యంత పటిష్టంగా చేపడుతున్నాం. గ్రామాల ప్రధాన కూడళ్ల వద్ద డబుల్ లేయర్ సీసీ రోడ్డు నిర్మిస్తున్నాం.

–ప్రభు, డీఈ, ఆర్‌అండ్‌బీ, అనకాపల్లి

## ఆకు కూరలతో ఆరోగ్యం



రోగిని పరిక్షీస్తున్న వైద్యుడు పైలా సాయిశేఖర్

**అనకాపల్లిటౌన్:** మనం తినే ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని విశాఖ కేర్ ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ పైలా సాయిశేఖర్ అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో అనకాపల్లి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 180 మంది సభ్యులకు బుధవారం ఉచితం వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సును బట్టి ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలన్నారు. వ్యాయామం చేయడం వల్ల శరీరంలో అవయవాల కదలికలు పెరిగి, రక్తప్రసరణ బాగా జరుగుతుందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి.గౌరీపతి మాట్లాడుతూ ప్రతి నెల మొదటి బుధవారం సభ్యులకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కేర్ ఆస్పత్రి ఎముకల వైద్యుడు సంతోష్, జనరల్ వైద్యురాలు వేణి, అసోసియేషన్ సీనియర్ సభ్యులు కుండల రామకృష్ణ, నల్లల దేముళ్లు, వి.రామకృష్ణ, ఎంబీవీ స్వామి, బీఎల్ఎన్ శర్మ, పి.బాబురావు, విల్లూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ తనిఖీలు



కశింకోటలో 108 వాహనాన్ని పరిశీలిస్తున్న అనకాపల్లి డివిజన్ అధికారి నాగేష్

**కశింకోట:** ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు కాల్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సాధ్యమైనంత తొందరగా ఆస్పత్రికి చేర్చేలే 108 సిబ్బంది కృషి చేయాలని అనకాపల్లి డివిజన్ అధికారి నాగేష్ సూచించారు. కశింకోటలో 108 వాహన నిర్వహణ, సిబ్బంది పనితీరును బుధవారం పరిశీలించారు. వాహనంలో ఉన్న బయో మెడికల్ పరికరాలు ఎంత వరకు ఉపయోగపడుతున్నాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. 108 వాహనం సేవల మాదిరాగానే శిశు మరణాల రేటు తగ్గించే చర్యల్లో భాగంగా ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవజాత శిశు అంబులెన్స్‌ను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో అందుబాటులో ఉంచామన్నారు. దీని సేవల్ని కూడా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. 108 సిబ్బంది చంద్రమౌళి, పైలట్ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు



పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

**అనకాపల్లి రూరల్:** తుమ్మపాల పంచాయతీ పరిధి చిన్నబాబు కాలనీ నుంచి గుండాల వీధి వరకూ దెబ్బతిన్న మంచి నీటి పైప్‌లైన్‌కు బుధవారం యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేశారు. ఇక్కడ మూడు రోజుల క్రితం పైప్‌లైన్ దెబ్బతినడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన గ్రామ పంచాయతీ పాలకవర్గం నీటి సరఫరా నిలిచిపోవడానికి కారణమైన పైప్‌లైన్‌కు తక్షణమే మరమ్మతు పనులు చేయించారు. మరమ్మతుకు గురైన మోటారుకు రిపేరు చేయించి, పగిలిన పైపును తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు. మరమ్మతు పనులు పూర్తి కావడంతో బుధవారం రాత్రి పూర్తి స్థాయిలో నీటి సరఫరాను పునరిద్ధరించినట్లు సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తెలిపారు. ఈ పనులను మండల వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, వార్డు సభ్యులు కొయ్య భాస్కరరావు, నాగ అప్పారావు, తత్ర సత్యారావు, స్థానిక నాయకులు పర్యవేక్షించారు.

## విస్తృతంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు



సమావేశంలో పాల్గొన్న ఫౌండేషన్ ప్రతినిధులు

**పరవాడ:** ఈ నెల 30న వ్యాస పూర్ణిమను పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ రక్ష ధరించాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్‌డివిజన్ ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు అన్నారు. పరవాడ రామాలయంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు దేశానికి, ధర్మానికి, గ్రామానికి రక్షగా నిలవాలన్నదే సమరసత సేవా ఫౌండేషన్ ఆశయమన్నారు. ఈ మాసంలో రెండు పౌర్ణమిలు, రెండు ఏకాదశిలు వస్తున్నాయన్నారు. పౌర్ణమి, ఏకాదశి రోజుల్లో సామూహిక హారతి ఇవ్వాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని ప్రజలంతా ఘనంగా జరుపుకోవాలన్నారు. ప్రతీ వ్యక్తిలో దేశభక్తి నింపాలన్నారు. దేవాలయాలు, ధర్మం పట్ల అభిమానం కలిగి ఉండాలన్నారు. సమావేశంలో మాతృమూర్తులు నూకాలమ్మ, పార్వతి, సహాయ కన్వీనరు పైల శ్రీను, సభ్యులు కట్టా ఆదినారాయణ, పి.లోవరాజు, బి.గంగరాజు,వి.సూరిబాబు, అన్నాజీ పాల్గొన్నారు.

## శాశ్వత పైప్‌లైన్ ఏర్పాటు



తాగునీటి పైపులు వేస్తున్న సిబ్బంది

**పరవాడ:** జీవీఎంసీ 84వ వార్డు సాలాపువానిపాలెం గ్రామంలో హైవే వెంబడి ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్ మరమ్మతులకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడి పైప్‌లైన్ తరచూ మరమ్మతులకు గురయ్యేది. విషయాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు కన్వీనర్ సాలాపు సంతోష్ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆయన ఆదేశాల మేరకు జీవీఎంసీ అధికారులు బుధవారం ప్లాస్టిక్ పైపు లైన్‌ను తొలగించి శాశ్వత పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారని వార్డు కన్వీనర్ సంతోష్ తెలిపారు.

## అభిమాని కుటుంబానికి సాయం



శివనాయుడు కుమారుడికి నగదు అందిస్తున్న బృంద సభ్యులు

**అనకాపల్లిటౌన్:** ప్రజోపయోగ కార్యక్రమాలతో పాటు అభిమానుల కుటుంబాలకు ఏపీ విక్టరీ వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ బృందం అండగా నిలుస్తుందని సంఘ వ్యవస్థాపకుడు పి.చందు అన్నారు. యలమంచిలి నియోజకవర్గం తిమ్మరాజుపేటకు చెందిన అభిమాని మళ్ల శివనాయుడు కుటుంబానికి బుధవారం రూ.40 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన శివనాయుడు పెద్ద కుమారుడిని ఆస్పత్రిలో చేర్చగా శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న అతనికి తమ వంతు సాయం సంఘ సభ్యులు పలివెల రాంబాబు, గొంతిన వెంకట్, రాయి వెంకటరమణ, సోమేష్, మడగల నరిసింగరావులు అందించినట్లు తెలిపారు.

## తాగునీటి బోర్లకు శ్రీకారం



కశింకోటలో మంచినీటి బోర్లకు భూమి పూజ చేస్తున్న బుల్లిబాబు

**కశింకోట:** కశింకోటలో తాగునీటి సమస్య నివారణకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో జల్ జీవన్ మిషన్‌లో రూ.30 లక్షల నిధులు మంజూరైనట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. ఈ నిధులతో అదనపు పైపులైన్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఈ నిధుల్లో నుంచే అవసరమైన చోట తాగునీటి బోర్లు తవ్విస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు కశింకోటలో ఆయన బోర్ల ఏర్పాటు పనులకు బుధవారం భూమి పూజ నిర్వహించారు.

## పకడ్బందీగా ఇంటింటి ఓటరు సర్వే



ఇంటింటి ఓటరు సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్ని కృష్ణ

**కశింకోట:** ఓటరు జాబితాపై ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, అర్హులందరినీ ఓటర్లుగా చేర్పించాలని ఆర్డీవో చిన్ని కృష్ణ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, బయ్యవరం గ్రామాల్లో సమగ్ర ఓటరు సర్వే తీరును బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఉప తహసీల్దార్ సురేష్‌నాయుడు, ఆర్ఐ రమేష్ తదితరులున్నారు.

## 'టీం జగనన్న' ప్రతినిధులకు ప్రశంస



టీం జగనన్న యాప్ బృందానికి ప్రశంసా పత్రాలను అందించిన మంత్రి అమర్‌నాథ్

**అనకాపల్లిటౌన్:** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను టీం జగనన్న యాప్(సోషల్ మీడియా) ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బుధవారం మిందిలోని మంత్రి నివాసంలో టీం జగనన్న యాప్ ద్వారా అనకాపల్లి నియోజకవర్గంలో ప్రతిభ కనబర్చిన వ్యక్తులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా విస్తృత స్థాయిలో ప్రజలకు చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో టీం జగనన్న యాప్ సభ్యులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీలతో పెండింగ్ చలానాల వసూలు



వాహనాలు తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రమేష్

**అనకాపల్లిటౌన్:** ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వ్యక్తులు మాత్రమే వాహనాలను నడపాలని ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపేవారి వల్ల వారితోపాటు ఇతర వాహనదారుల ప్రాణాలకూ ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. పట్టణ పరిధిలో ప్రమాదాల నియంత్రణకు ఆటో, ద్విచక్ర వాహనాలు, కారు నడిపే వ్యక్తులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పలు వాహనాలపై పెండింగ్ ఈ చలానాలను సుమారు రూ.40 వేలు ఆన్‌లైన్‌లో వాహనదారులతో కట్టించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయనతోపాటు హెచ్‌సీ రెడ్డి శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

## యూసీసీతో దేశ సమైక్యతకు విఘాతం





సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఎస్ శర్మ

**అనకాపల్లి రూరల్:** ఉమ్మడి పౌర స్మృతి(యూనిఫాం సివిల్ కోడ్-యూసీసీ) అమలు, దేశ సమైక్యతకు విఘాతం కలిగించడమేనని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. పట్టణంలోని దొడ్డి రామానాయుడు భవన్(సీఐటీయూ కార్యాలయం)లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. భారత దేశం భిన్న జాతులు, మతాలతో కూడిన లౌకిక రాజ్యమన్నారు.

యూసీసీ ప్రతిపాదనను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. యూసీసీ వల్ల ఐక్యంగా జీవిస్తున్న ప్రజల మధ్య వైషమ్యాలు పెరుగుతాయన్నారు. 21వ లా కమిషన్ సిఫార్సులను కాదని, 22వ లా కమిషన్ సిఫార్సుతో యూసీసీ అమలుకు ఉత్సాహం చూపడం రాజకీయ దురుద్దేశమేనని ఆరోపించారు. 2024 పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీజేపీ దీనికి పాల్పడుతోందన్నారు. దేశంలో వివిధ మతాలు, జాతుల ఆచారాలు, వివాహ సంప్రదాయాలు, విడాకుల విధానాలు వేర్వేరుగా ఉన్నాయని, వాటన్నింటికీ ఒకే చట్టాన్ని అమలు చేయాలనుకోవడం సరికాదన్నారు. సదస్సులో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు బి.ఉమామహేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.చిన్నబ్బాయ్, గంటా శ్రీరామ్, పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికులు పాల్గొన్నారు.

## పోషణ కిట్లతో గర్భిణులకు శ్రీరామరక్ష



బాలింతకు పౌష్టికాహార కిట్‌ను అందిస్తున్న గొర్లి సూరిబాబు

**అనకాపల్లిటౌన్:** గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ శ్రీరామరక్షని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని పాపయ్యసంతపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఆయన వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిండు గర్భిణులు, శిశువులు కలిగిన బాలింతల పోషణకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా శిశువుల్లో రక్తహీనతను నిర్మూలించవచ్చన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీడీపీవో శశికళ, మండల కో ఆప్షన్ సభ్యులు బొండా అప్పలరాజు, సర్పంచ్ అన్నం చెల్లాయమ్మ, పునులేటి రామకృష్ణ, మోహనరావు, కోరుకొండ శ్రీనివాసరావు, గనిరెడ్డి అప్పారావు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## నేడు సత్తెమ్మతల్లి వార్షికోత్సవం





సత్తెమ్మతల్లి అమ్మవారు

**అనకాపల్లిటౌన్:** స్థానిక గవరపాలెం సుంకరమెట్ట జంక్షన్ సత్తెమ్మతల్లి ఆలయ 32వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బొడ్డేడ మోహనరావు తెలిపారు. బుధవారం అమ్మవారి ఆలయం వద్ద వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 8 నుంచి గురువారం ఉదయం 10 గంటల వరకు అమ్మవారికి ఏకాం భజన జరుపుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కార్యదర్శి విల్లూరి త్రినాథ్, కోశాధికారి దాడి వెంకునాయుడు, ఉపాధ్యక్షుడు బుద్ద కిషోర్, మహిళలు పాల్గొన్నారు.

## పార్కు అభివృద్ధికి చర్యలు



రిక్రియేషన్ పార్క్‌ను శుభ్రం చేయిస్తున్న సర్పంచ్

**పరవాడ:** స్థానిక కోనేరు వద్ద ఉన్న పార్క్ రూపురేఖలు మార్చడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. కోనేరు వద్ద లుపిన్ పరిశ్రమ యాజమాన్యం రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన రిక్రియేషన్ పార్క్‌ను గ్రామ ప్రజలు కొంత కాలం పాటు సక్రమంగా వినియోగించుకున్నారు. ఆ తర్వాత పార్క్ నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది. తాగిన మద్యం సీసాలు చెల్లాచెదురుగా విసిరేయడం, సీసాలు పగలగొట్టడంతో పార్క్ నిండా గాజుపెంకులు, పిచ్చి మొక్కలు పెరిగి క్రిమికీటకాలకు ఆవాసంగా మారింది. అధ్వానంగా మారిన పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దడానికి పంచాయతీ అధికారులు నడుం బిగించారు. దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలు తొలగించడంతో పాటు చెల్లాచెదురుగా పడి ఉన్న గాజుపెంకులు, చెత్తా చెదారాలను ఏరివేశారు. పార్క్‌లో చేపడుతున్న పనులను సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పార్క్‌ను అందంగా తీర్చిదిద్ది పూర్వ వైభవం తీసుకువస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు.